క్లుప్తంగా

నేడు మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

భీమవరం(ప్రకాశం చౌక్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను భీమవరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు



విద్యుత్ పొదుపుపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం కాళ్ల మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ పొదుపుపై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్తు అతి వాడకంతో వనరులు తరిగి రేపటి తరమంతా చీకటిలో జీవించే రోజు వస్తుందని, భవిష్యత్తు తరాల వారి కోసం నేడు ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపును చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్రీయ రహదారి వెంబడి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు విష్ణు విద్యార్థుల ఎంపిక



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విష్ణు విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఈ నెల 16,17 తేదీల్లో నర్సాపురం స్వర్ణాంధ్ర కళాశాలలో జరిగిన జెఎన్‌టీయూకె ఫుట్‌బాల్ సెలక్షన్ పోటీల్లో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎం.వేణు తెలిపారు. పి.దివాకర్, కె.పినాకిని, బి.వెంకటేశ్వర్లు నాయక్, ఎస్.సుభాష్ పాల్ పోటీల్లో ఎంపికయ్యారని, వీరు కేరళలో ఈనెల 22వ తేది నుంచి జరగబోయే సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పీడీ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి, కోచ్.కె.శివ ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయిన్ అస్మి, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈనెల 20వ నుంచి జనవరి 19 వరకూ ఈ మాసోత్సవాలు నిర్వహిస్తామని డిపో మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల ధర్నా




పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

పెనుగొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆయువు పట్టుగా ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. వల్లూరు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరి రక్షణకు, అందరికీ ఆరోగ్యం అందించేందుకు హెల్త్ అసిస్టెంట్లు కీలక భూమిక పోషిస్తారన్నారు. అటువంటి హెల్త్ అసిస్టెంట్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు వేణుబాబు, హైందవి, జి.వసంత కుమారి, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కోలాహలం



పట్టణంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్యాలు



క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్



క్రిస్మస్ పండగకు అలంకరణ వస్తువులు, స్టార్స్ దుకాణం ఏర్పాటు చేసిన దృశ్యం

- అందంగా ముస్తాబైన చర్చిలు
- ఈ నెల 25న వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భీమవరం(ప్రకాశం చౌక్): క్రిస్మస్ కోలాహలం మొదలైంది. ఈనెల 25న క్రైస్తవులకు పర్వదినం. తణుకులో క్రైస్తవ మందిరాలు, విశ్వాసుల గృహాలు నూతనత్వాన్ని సంతరించుకున్నాయి. సత్యం, శాంతి, కరుణ, త్యాగం, దయ, ప్రేమ, నిరీక్షణ అనే సందేశాలతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. త్యాగానికి ప్రతీక అయిన క్రిస్మస్ వేడుకను ఈ నెల 25న జరుపుకొనేందుకు క్రైస్తవులు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో డిసెంబరు నెల ప్రారంభం నుంచే క్రైస్తవుల ఇళ్లు, ప్రార్థనా మందిరాలు, వీధుల్లో స్టాల్స్ ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలకరించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు ప్రత్యేక అరాధనలు, ప్రార్థనలు, సెమి క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భీమవరం పలు చర్చిలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తునే 25నాటికి క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా అలంకరిస్తున్నారు.

ప్రత్యేక క్రిస్మస్ సభలు, ప్రార్థనలు:

పట్టణంలో పలు ప్రాంతాల్లోని షాపుల్లో క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, చర్చిల అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగు సాగుతున్నాయి. వివిధ రకాల మోడళ్లలో, రేట్లలో ఇవి లభిస్తున్నాయి. ఎలక్ట్రికల్ స్టార్లు, కాగితం, ప్లాస్టిక్‌తో తయారు చేసిన స్టార్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. స్టార్లు రూ.50 నుంచి రూ.600వరకూ ఉన్నాయి. క్రిస్మస్ ట్రీలు సైజు, నాణ్యత మేరమకు రూ.100 నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. హోప్, సీఎస్ఐ ఉన్నత పాఠశాలలల్లో సండే స్కూల్ పిల్లలు, యువజనులు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే నాటికలు, నృత్యాలు సాధన చేస్తున్నారు.

24, 25 తేదీల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఈనెల 24, 25 తేదీల్లో పట్టణంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ పురష్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. 24 తేదీ రాత్రి నుంచి 25 తేదీ సాయంత్రం వరకు ఆయా చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. చర్చిల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా జల్లా కొండయ్య



జల్లా కొండయ్య

భీమవరం అర్బన్: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా జల్లా కొండయ్య గురువారం రాయలంలో జిల్లా అధ్యక్షుడు ముదునూరిప్రసాదరాజు నియమించారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ముందునూరి ప్రసాదరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ఉభయ గోదావరి జిల్లాల సేవాదల్ అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు, రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, నరసాపురం పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాలకు, జెడ్పీటీసీ నర్సింహరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్, సర్పంచ్ జల్లా కొండయ్య మాట్లాడుతూ నిరంతరం శక్తి వంచన లేకుండా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ జెండా ఎగరవేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

కమిషనర్ ఆకస్మిక తనిఖీ

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని స్థానిక జువ్వలపాలెం రోడ్డులో చంద్రిక టిఫిన్ సెంటర్‌ను కమిషనర్ కె.రామచంద్రరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా టిఫిన్ సెంటర్‌లో వ్యర్థాలను డ్రెయినేజీలో పడేయడం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా చేయకపోవడంతో ఆ ప్రాంతంలో అపారిశుద్ధ్యం నెలకొంది. దీనిపై కమిషనర్ టిఫిన్ సెంటర్‌కు జరిమానా విధించి మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



వెంపలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు



బహుజన జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

వీరవాసరం: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అంకెం సీతారాం డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన వీరవాసరంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. వీరవాసం పెదపేటలో మండల మాల మహానాడు అధ్యక్షుడు తాడి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడపాటి సాగర్, వెంపల్ల నరసింహమూర్తి బన్ను తదితరులు పాల్గొన్నారు.

వెంపలో అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన

భీమవరం అర్బన్: ఇటీవల పార్లమెంట్‌లో భారత రాజ్యాంగా నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనేక దేశాలు పర్యటించి తన రాజ్యాంగం ద్వారా దశ, దిశను మార్చారన్నారు. అంతేకాకుండా రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కల్పించారన్నారు. కేంద్రమంత్రి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు కన్నమ్మ దాసు, వేగిదీపాటి పెద్దిరాజు, మోహన్‌రావు, వర్ధనపు నర్సింహులు, ఇంజేటి శాంతారావు, చిలకపాటి లాజర్, పోలు కొండ సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

బహుజన జేఏసీ నిరసన

భీమవరం: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఏపీ బహుజన జెఎసి ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశంచౌక్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడిన అమిత్‌షాను పదవి నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాటలు వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఫౌండర్ ప్రెసిడెంట్ తాళ్లూరి మధు, గడ్డ రమేష్ బాబు, దానం విద్యాసాగర్, బడుగు అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా మంత్రి పదవి బర్తరఫ్ చేయాలి

ఉండి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అమానపరుస్తూ అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా సమితి కార్యదర్శి కోనాల భీమారావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాంప్రసాద్, సనపల శ్రీనివాస్, తమరాని శ్రీనివాస్, పున్నాని అపాప్రావు, తదితరులు పాల్గొన్నారు.

శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును కలిసిన కొండయ్య



మోషేన్‌రాజును కలిసి పుష్పగుచ్చం అందజేస్తున్న మండల కన్వీనర్ జల్లా కొండయ్య

భీమవరం అర్బన్: శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా నియమితులైన జల్లా కొండయ్య మోషేన్‌రాజు క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు, సర్పంచ్‌లు నాగిడి నారాయణస్వామి, ఒడుగు ముత్యాలరావు, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, బొమ్మిడి రాజేంద్రప్రసాద్, మోకా ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

జనం మెచ్చిన నేత వైఎస్ జగన్

ఆకివీడు: జనం మెచ్చిన నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మండల అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఈ నెల 21వ తేదీ శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ శుక్రవారం చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలోని దళితపేటలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద, ఆకివీడులోని ప్రధాన సెంటర్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేకు కట్ చేసి, దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు ఆకివీడులోని వైఎస్సార్ విగ్రహం వద్దకు రావాలని పిలుపునిచ్చారు.

దొరగారి చెరువు పనులు పూర్తి చేయాలి



దొరగారి చెరువు అభివృద్ధిని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు

ఆకివీడు: పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న దొరగారి చెరువు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు సూచించారు. చెరువు ప్రాంతాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. చెరువుకు పడమర వైపున ఫెన్సింగ్ పనులు పూర్తి చేయలేదని, చెరువు చుట్టూ మొక్కలను నాటాలని ఆదేశించారు. వాకర్స్ కోసం నిర్మించిన వాకింగ్ మార్గంలో ప్రజలు నడక ప్రారంభించారని, చెరువు చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు మోటుపల్లి రామ వర ప్రసాద్, కమిషనర్ జీ.కృష్ణమోహన్, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, నాయకులు పాల్గొన్నారు.

కూలీలకు పని దినాలు పెంచాలి

మొగల్తూరు: ఉపాధి కూలీలకు పని దినాలు పెంచేలా అధికారలు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరంలో రూ.10.66 కోట్లతో చేపట్టిన 1790 పనులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం, అంబుడ్స‌మన్ కె.ఆదినారాయణ, పీఆర్ ఏఈఈ వెంకటేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ నీలిమ, ఎంపీటీసీలు, జేఈ ఆనంద్,టీఏ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని సీపీఎం భీమవరం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లులు మూతపడి కార్మికులు రోడ్డున పడుతున్నారని అన్నారు. తణుకు షుగర్ ఫ్యాక్టరీ, వేంద్ర పేపర్ మిల్లులు వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకునేవని అట్లాంటి పరిస్థితి నేడు లేదన్నారు. ఆక్వా రంగం అభివృద్ధి చెందాలని పాలకులు చెబుతూనే ఎటువంటి సహకారం చేయకపోవడం వల్ల ఆక్వా రంగం కుదేలవుతుందని అన్నారు. ఉపాధి కోసం వలసలు తీవ్రమయ్యాయని ఏ ప్రాంతంలోనూ కూడా కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు జరగకపోవడం వల్ల ఉద్యోగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని కొత్త పరిశ్రమలు నిర్మించి, మూతబడిన పరిశ్రమలని తెరిపించి ఉపాధి సమస్యను పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి వాసుదేవరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, డి నాగేశ్వరరావు, కృష్ణ, కోదండమ్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

కాళ్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జిల్లా సమగ్ర శిక్ష పీడీ, వైద్య, ఆరోగ్యశాఖ మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న ఆపరేషన్ థియేటర్, ఆసుపత్రికి వచ్చే గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది దీర్ఘ కాలిక పేషంట్లకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలని, సిబ్బంది తీసుకోవాల్సిన పలు విషయాలపై సూచనలు సలహాలు చేశారు. అదేవిధంగా ఆసుపత్రిలో భీమవరం ఏరియా ఆసుపత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ టి.శంకర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా ఒకరోజు మానసిక రోగుల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్‌కుమార్, డాక్టర్ భావన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సేవ చేయడానికి ముందుకు రావాలి



సైనిక సంక్షేమ నిధికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ఎన్‌సీసీ క్యాడెట్లు సకాలంలో శిక్షణ పూర్తి చేసుకుని దేశ నిర్మాణానికి తమ వంతు సేవలను అందజేయాలని 19వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎన్నార్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సాంఘిక, సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. దేశ రక్షణకు త్రివిధ దళాలలో చేరి దేశ సేవ చేయడానికి ముందుకు రావాలని కోరారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో సైనిక సంక్షేమ నిధికి సేకరించిన విరాళాల మొత్తం రూ.33,922/- చెక్కును కల్నల్ అమిత్ పాండేకు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు అందజేసారు. ప్రిన్సిపాల్ జి. మోజస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు మంగళం

- వైఎస్సార్ సీపీ హయాంలో స్పెషలిస్టు డాక్టర్లతో సేవలు
- ఉచితంగా పరీక్షలు, మందులు సైతం పంపిణీ
- ప్రస్తుతం ఊసెత్తని వైనం



జగనన్న ఆరోగ్య సురక్షలో మందులను ఉచితంగా అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

వీరవాసరం: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. దీనిలో భాగంగా నిపుణులైన వైద్యులు 14రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసేవారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాల్టీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం వారికి భారంగా మారింది.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దీంతో గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇబ్బందులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. పంచాయతీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందజేశారు. వైద్య శిబిరాలను పేదకలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: ద్విచక్రవాహనంపై వెళుతున్న కె.నర్సింహమూర్తిని కారు ఢీకొట్టడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు భీమవరం టూటౌన్ పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

శ్రీనివాస రామానుజన్ జీవితం ఆదర్శనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

కాళ్ల: ప్రతి విద్యార్థి ప్రపంచ మేధావి భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. కాళ్ల మండలం సీసలిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో శుక్రవారం నిర్వహించిన గణిత దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రీనివాసరామానుజన్ యొక్క గొప్పతనాన్ని, నిత్యజీవితంలో గణితం యొక్క ఉపయోగాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆదర్శ భావాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.రవీంద్ర, గ్రామ సర్పంచ్ బి.ధనలక్ష్మి, ఉపసర్పంచ్ బి.మాణిక్యాలరావు, యూటీఎఫ్ నాయకులు సీహెచ్ పట్టాభి రామయ్య, జి.రామకృష్ణంరాజు ఉపాధ్యాయులు బీఆర్‌ఎంకే స్వామి, బి.మురళి, ఎం.శంకర్, పి.పాపారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నారాయణ

ఆకివీడు: టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంపొందించాలని జిల్లా విద్యా శాఖ అధికారి నారాయణ ఆదేశించారు. స్థానిక చూట్ మెమోరియల్ (సీఎం) హైస్కూల్, దుంపగడప గ్రామంలోని జెడ్పీ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. దుంపగపడలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థుల్లో పఠనాశక్తి, మేథాశక్తిని పరిశీలించారు. మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. స్టడీ మెటీరియల్‌ను చదివిస్తూ విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుంటూ టెన్త్‌కు ప్రిపేర్ అవ్వడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను, హాజరు పట్టీని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ, ఎంఈఓ ఎ.రవీంద్ర, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జాస్పర్ ఇండస్ట్రీస్ నూతన ట్రక్స్ షోరూమ్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): టాటా మోటార్స్ ఆథరైజ్‌డ్ డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ భీమవరం, ఉండి రోడ్డులో నూతనంగా టాటా ట్రక్స్ సేల్స్ షోరూమ్, సర్వీస్ వర్కుషాపును టాటా మోటార్స్ ట్రక్స్ టెరిటరీ మేనేజర్ ప్రసాద్, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పి.వి. సత్యన్నారాయణరావు సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ భీమవరంలో వినియోగదారులకు అందుబాటులో ఆధునిక సౌకర్యాలు గల షోరూంను తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రారంభోత్సవం రోజే 5 ఇంట్రా వాహననాలను వినియోగదారులకు డెలివరి చేశారు. ట్రక్స్‌పై ఆకర్షణీయమైన ఆఫర్లను అందజేయనున్నట్లు సేల్స్ జనరల్ మేనేజర్ ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టాటా మోటార్స్ ప్రతినిధులు, జాస్పర్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్, సేల్స్ మేనేజర్ పవన్, పారిశ్రామికవేత్తలు, వినియోగదారులు పాల్గొన్నారు.